సాదుం జయరాం కథలు

# 16

# యువకిశోరం

ఫైనలియర్ బి.ఏ. చదువుతున్న సుదర్శనానికి బోలెడు విషయాలు తెలుసు. ఏ చిత్రం ఎప్పుడు విడుదల అవుతుందో తెలుసు. ఏ థియేటరుకు ఏ చిత్రం వస్తుందో తెలుసు. ఏ చిత్రానికి ప్రభుత్వ అవార్డు లభిస్తుందో, ఏ చిత్రం ఎన్ని రోజులు పోతుందో కూడా చెప్పగలడు. ఏ టెర్రిలిన్ బట్ట ఎంత ఖరీదు చేస్తుందో సులభంగా చెప్పగలడు. ఇలా అతనికి తెలిసినవన్నీ జాబితా తయారు చేస్తే పెద్ద ఉద్గ్రంథ మవుతుంది. అవన్నీ అప్రస్తుతం. ప్రస్తుతం సుదర్శనానికి తెలియంది ఒటి ఉన్నది. అది ఎదురింట్లో ఉన్న హేమ విషయం.

హేమ తన్ను ప్రేమిస్తున్నదా లేదా అన్నది సుదర్శనానికి అంతుపట్టని విషయం.

హేమ అందమైన అమ్మాయి. ఆ అందం చూస్తే కళ్లు చల్లబడతాయి ఆ అమ్మాయి నడిస్తే అద్భుతంగా ఉంటుంది. నిడుపాటి జడ గడియారం పెండ్యులంలా ఊగుతూ పిరుదలమీద లయబద్ధంగా తాళంవేస్తూ ఉంటుంది.

అంత అందమైన హేమ – ఎప్పుడూ టెర్రిలిన్ చీరలో ఉండగా సుదర్శనం చూడలేదు. కనీసం ఫుల్‌వాయిల్ చీరలో ఉండగానన్నా చూడలేదు. ఆ అమ్మాయి ఎప్పుడూ పేరులేని నాసిరకం చీరలే కడుతుంది. వాటికైనా ఒకటి రెండు చిరుగులు. అట్లా ఉన్న హేమను చూస్తే సుదర్శనానికి బోల్డు కోపం, బోల్డు దుఃఖం జమిలిగావచ్చి బావురుమనాలనిపిస్తుంది.

మొదటిసారిగా సుదర్శనం హేమను నాలుగు మాసాల కిందట చూచాడు. అంతకు మునుపు సుదర్శనం హాస్టల్లో ఉన్నాడు. రెండేళ్ల హాస్టలు జీవితం సుదర్శనంలో ఎక్కడలేని అసంతృప్తిని కలిగించింది. పేకాట, చచ్చు సెక్సు పత్రికలు తప్ప మరో ఆకర్షణ లేదు - హాస్టలు జీవితంలో, హాస్టలు బయట ఉన్న వారికి – అనుభవాలు సంపాదించేందుకు రకరకాల అవకాశాలు ఉన్నాయి. అనుభవాలు సంపాదించాల్సిన వయసులో జైలులాంటి హాస్టల్లో ఉండడం ఏ విధంగా చూచినా సమర్థనీయంగా కన్పించలేదు సుదర్శనానికి. అందుకని రూం కోసం అన్వేషణ మొదలు పెట్టాడు.

అన్ని సదుపాయాలు ఉన్న రూములు చాలానే తగిలాయి – తగలంది, అనుభవాలకు అనుకూలంగా ఉన్న పరిసరాలు!

ఒక సుప్రభాతాన సుదర్శనం సైకిలుమీద వెళుతున్నాడు. ఉన్నట్టుండి సైకిలుకు బ్రేకులు పడ్డాయి. అదే సుదర్శనం హేమను చూడటం. హేమ ఇంటిముంగల నిలబడి ఒక చిన్న అబ్బాయికి ముఖం కడిగిస్తోంది. కాసేపు సుదర్శనం కనురెప్పల్లో చలనం ఆగింది. కళ్లు జిగేలుమనిపించే బ్యూటీ, ఈ మారుమూల సందులో ఉండటం సుదర్శనాన్ని చకితుణ్ని చేసింది. ఉన్నట్టుండి ఎదురుగా ఉన్న మేడమీదికి సుదర్శనం దృష్టి మళ్ళింది. 'టు లెట్' అన్న బోర్డు వ్రేలాడుతోంది మేడమీద. బట్టీపెట్టిన ప్రశ్నలే కొశ్చన్ పేపర్లో చూచినంత ఆనందం కలిగింది. ఒక్కక్షణం ఆలోచించి, మెల్లగా ఆ అమ్మాయి దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. లాగిపెట్టిన కాటుక కళ్ళతో, హేమ ప్రశ్నార్థకంగా సుదర్శనంవైపు చూచింది.

'ఆ మేడమీది గది బాడుగకు ఇస్తారా అండీ?' అన్నాడు.

'బోర్డుందిగా. ఇవ్వొచ్చు'.

'థాంక్స్'.

'నో మెన్షన్'.

హేమ ఇంట్లోకి వెళ్ళింది. ప్రతి కదలికలోనూ ఆకర్షణ ఉంది. ఆ అమ్మాయిది కంఠంకాదు, వీణ. ఏదో శాపంమూలాన ఈ పెంకుటింట్లో అవతరించింది. సుదర్శనం గాఢంగా నిట్టూర్చి సైకిలెక్కాడు.

సరే, ఆ రాత్రి ఏడుగంటలకు సుదర్శనం గది ప్రవేశం జరిగింది. పక్కపరచి పడుకున్నాడు గాని నిద్రపట్టలేదు. కన్ను మూసినా తెరచినా ఒకటే దృశ్యం. రాత్రి యే ఒంటిగంటకో కలత నిద్రపట్టి డ్రీమ్ సీక్వెన్సులు మొదలయ్యాయి.

అందులో హేమ నిరస్తభూషణ కాదు. మెడలో జిగేలుమనే రవ్వల నెక్లెస్, వంపుల్ని, సొంపుల్ని స్పష్టంగా బయటపెట్టే డ్రెస్, మత్తెక్కించే పరిమళాలు – తనతో అతుక్కుపోయి తనలో ఒకటిగా అయిపోయిన ఆ అమ్మాయి – ఓహ్ – అద్భుతమైన సినిమాకల!

కల చెదిరింది, తను చదవని ప్రశ్నలు - పరీక్ష పేపర్లో కనిపిస్తే ఎంత బాధ కలుగుతుందో అంత బాధ పడ్డాడు!

ఉదయం పదింటికి కాఫీ త్రాగి, యేదో వారపత్రిక ముందేసుకొని ఆ అమ్మాయిని గురించి ఆలోచిస్తున్నాడు, తలుపు దగ్గర చప్పుడై తలెత్తి చూచాడు. ఎవరో ముసలాయన గడ్డం పెరిగి, బట్టలు మాసి, దీనంగా ఉన్నాడు. సుదర్శనానికి చిరాకు కలిగింది.

'మీరూ...'

'నేను బాబూ! ఎదురింట్లో ఉంటున్న రంగనాధాన్ని. ఏమీ తోచక పోతేనూ...'

ఆ అమ్మాయి తండ్రి కామాలు, విడుదలయిన పిక్చరుకి మొదటిరోజు మొదటి ఆటకు టిక్కెట్టు దొరికినంత సంతోషం కలిగింది. వినయం ఉట్టిపడేట్లు రెండు చేతులూ ఎత్తి నమస్కరించి ఆహ్వానించాడు. ఆ ముసలాడు కాసేపు కూర్చొని ఆ మాటా ఈ మాటా మాట్లాడి వెళ్లాడు. ఉన్న కాసేపూ ఆ ముసలాడితో సుదర్శనం వరమీయవచ్చిన వేల్పుతో మాట్లాడినట్టు మాటాడాడు. ఉపకరిస్తాయేమోనని సుదర్శనం ఎన్నో విషయాలు రాబట్టాడు ఆయన్నుంచి. రంగనాధం గారు బడిపంతులుగా పనిచేసి రిటైరయ్యారు. ఐదుమంది సంతానం, హేమ పెద్దది యేదో ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తోంది. హేమకన్నా చిన్నవాళ్లు నలుగురూ చదువు కుంటున్నారు.

హేమ, తను ఆరాధించే హేమ - గుమాస్తాగా పనిచేస్తుందన్న విషయం సుదర్శనానికి బాధ కలిగించింది. లేదు. ఇలా జరగడానికి వీల్లేదు అనుకున్నాడు పిడికిలి బిగించి. ఎలా జరగడానికి వీలుందో తెల్పలేక పిడికిలి వదులుచేశాడు.

రోజులు గడుస్తున్నాయి. యే అనుభవాలు ఆశించి సుదర్శనం ఆ గదిలో చేరాడో, ఆ అనుభవాల తాలూకు ఛాయలన్నా సుదర్శనం కళ్ళకు కన్పించలేదు. సరిగ్గా పదింటికి హేమ క్యారియర్‌తో ఆఫీసుకు బయలుదేరుతుంది. మళ్ళీ ఆరింటికి ఇంటికి వస్తుంది. ప్రళయం జరిగినా, సుదర్శనం ఉదయం పదింటికి, సాయంత్రం ఆరింటికి మేడమీదినుంచి దీనంగా హేమవైపు చూస్తాడు. ఒకసారి హేమ చూపు సుదర్శనంమీద పడుతుంది. కానీ ఆ చూపులో ఏ భావం ప్రదర్శించకుండానే తనదారిన తాను పోతుంది. అట్లా వెళ్తున్న హేమను చూస్తే సుదర్శనానికి ఏడవాలనిపిస్తుంది.

రాత్రి పడుకుంటే మొదటిరోజు తనతో మాట్లాడిన హేమ కళ్లల్లో మెదులుతుంది. తనతో మాట్లాడిన రెండు మాటలూ, 'బోర్డుందిగా ఇవ్వచ్చు', 'నో మెన్షన్' చెవుల్లో మాటిమాటికీ వినిపిస్తాయి. ఆ తర్వాత నిద్రలో రకరకాలైన కలలు! ఉదయం, 'కడకు మిగిలింది ఈ కలలేనా' అంటూ విచారంగా సినిమాలో హీరోలాగా పాడుకుంటాడు.

ఈ స్థితిలో కాలాన్ని ఈడ్చుకువస్తున్న సుదర్శనానికి ఉన్నట్లుండి పిడుగులాంటి వార్త చెవిన పడ్డది. ఉదయం పదింటికి నీటుగా టాయిలెట్ అయి, మేడమీద నిలబడి హేమ దర్శనంకోసం ఎదురు చూస్తున్నాడు. పది – పదింపావు – పదిన్నర – చిత్రం హేమ క్యారియర్‌తో బయటికి రాలేదు. కాసేపటికి రంగనాధంగారు పైకి వచ్చారు.

'రండి కూర్చోండి' సుదర్శనం కుర్చీ చూపించాడు. రంగనాధంగారు అస్తిమితంగా కూర్చొని తల గోక్కుంటున్నాడు. కాసేపున్న తర్వాత 'నీకు కాలేజీ టయిమైందల్లేవుంది' అన్నాడు.

ఫస్టవర్ లీజరు లెండి. ఏదన్నా పనిమీద వచ్చారా?' అన్నాడు సుదర్శనం.

పనిమీదే వచ్చాను. ఇవ్వాళ హేమకు పెళ్ళిచూపులకు వస్తున్నారు. ఒక పాతిక రూపాయలుంటే సర్దుబాబు. మళ్ళీ అమ్మాయి జీతం రాగానే ఇస్తాను. అలాగే ఈ కుర్చీలు పట్టించుకపోతాను' అన్నాడు.

సుదర్శనం గుండెల్లో బాంబు పేలినంత పనయింది. గొంతు పెగల్లేదు. జేబులో పాతిక రూపాయలు తీసి ఆయన చేతిలో పెట్టాడు. రంగనాథం గారి అబ్బాయి వచ్చి కుర్చీలు పట్టుకెళ్లాడు. నిర్జీవంగా సుదర్శనం గదికి తాళం వేసి కాలేజీకి బయలుదేరాడు.

హేమకి పెళ్ళిచూపులు! ఇంతకన్న అనర్థం లేదు. తను ఒక వరంగా భావిస్తున్న హేమని ఎవడో గద్దలా తన్నుకు పోయేందుకు వీల్లేదు. వీల్లేదు. సుదర్శనం బిగించిన పిడికిలిని వదలనే లేదు. కాలేజీ, లెక్చరర్స్, విద్యార్థులు ఎవరూ కనిపించడం లేదు. స్పష్టంగా కనిపిస్తున్నది పెళ్ళికూతురు వేషంలో హేమ.

సాయంత్రం ఐదింటికి రూముకొచ్చాడు సుదర్శనం. బయట కూర్చొని హేమ తమ్ముడికి పాఠం చెబుతోంది. సుదర్శనానికి హేమ కొత్తగా కనిపించింది. ఇవ్వాళ చెవుల్లో రింగులు ఉన్నాయి. మెడలో ఒంటిపేట గొలుసు. తలనిండా సన్నజాజులు. బహుశా పెళ్ళిచూపులకు అలంకరించుకొని ఉంటుంది.

తమ్ముడికి పాఠం చెబుతున్న హేమ యథాలాపంగా సుదర్శనం వైపు చూసింది. రకీమని సుదర్శనం కళ్ళతో మాట్లాడాడు. 'హేమా నన్ను అన్యాయం చెయ్యకు. నేను నీవాణ్ని. నీకోసం ఇక్కడ తపస్సు చేస్తున్నాను –' ఇట్లా వుంది ఆ ధోరణి. హేమకి ఆ భాష అర్థమయిందో లేదో కాని చూపులు మల్చుకొని మళ్ళీ తమ్ముడికి పాఠం చెప్పడంలో లీనమయింది.

సుదర్శనానికి పిచ్చెత్తినట్టయింది. హోటలుకు వెళ్ళబుద్ధి కాలేదు. రాత్రి నిద్రలో భయంకరమైన కలలు వచ్చాయి. హేమను ఎవరో కత్తులబోనులో ఉంచారు. చుట్టూ రాక్షసులు. తను అందర్నీ చిత్తుజేసి ఆమెను విడిపించాడు. హేమ లేడిపిల్లలా చెంగున దూకి తన్ను వాటేసుకుంది.

కసవు ఊడ్చే అమ్మాయి కలనుపాడు చేసింది. తన జీవితమే పాడు కాబోతోంది, మంచం మీదనుంచి లేచాడు. రాత్రి అన్నం తినకపోవడం మూలాన కాస్త నీరసంగా వుంది. ఓపిక తెచ్చుకొని హోటలుకెళ్ళి టిఫిన్ చేసి రూంకు చేరుకున్నాడు.

ఇన్నాళ్లూ తను హేమ దొరికితే అవసరానికి ఉపయోగించుకోవాలనుకున్నాడు. హేమ దేవతలాంటి అమ్మాయి. తను తప్పుగా ఆలోచించాడు. గృహిణిగా, ప్రేయసిగా తన జీవితంలో ఆమెకు పవిత్రమైన స్థానం ఇవ్వాలి. అప్పుడే ఆమె తనకు దక్కే అవకాశం ఉంటుంది. లేకపోతే ఆమె తనకు దూరమవుతుంది.

ఈ ఆలోచనతో సుదర్శనం హృదయం తేలిక అయింది. గబగబా డ్రెస్ చేసుకొని రంగనాథం ఇంటిముందు నిలిచాడు. బయట హేమ కొంగు బొడ్లో దోపి కుచ్చెళ్లు ఎత్తి కట్టుకొని, కళ్ళాపి చల్లుతోంది. అరటి బోదెల్లా నిగనిగ లాడుతున్న కాళ్ళమీద సుదర్శనం దృష్టి నిల్చింది. హేమ కాస్త సిగ్గుపడ్డది.

'నాన్న గారు ఇంట్లో ఉన్నారా?'

'లేరు. ఎక్కడికో వెళ్ళారు' అంది. చాలా రోజుల తర్వాత మళ్ళీ వీణాస్వరం వింటున్నాడు. వళ్ళు పులకించింది. ఇంకా రెండు మాటలు మాటాడాలనిపించింది. కానీ ఆమె పనిమీద వుంది. గదికి తిరిగొచ్చాడు.

గదిలో కూర్చుని, రంగనాథంగారు వచ్చిన తర్వాత మాట్లాడవలసిన విషయాల్ని గురించి ఆలోచిస్తున్నాడు.

కాసేపటికి హేమ గదిలోకి రావడం చూచి సుదర్శనం తబ్బిబ్బు అయిపోయాడు.

'మీరా? కూర్చొండి' అన్నాడు. ఆశ్చర్యం నుంచి తేరుకొని-హేమ కూర్చోలేదు. చేతిలో ఉన్న ఐదు రూపాయలనోట్లు ఐదు టేబుల్ మీద ఉంచి 'నాన్నగారు తీసుకున్నారటగా! ఇందాక మీరు డబ్బుకోసమే వచ్చారేమోనని తెచ్చాను' అంది.

'అబ్బెబ్బె! డబ్బుకోసం రాలేదు' అన్నాడు సుదర్శనం.

హేమ వెళ్ళబోతోంది.

గదిలో ప్రవేశించిన అదృష్టదేవత అదృశ్యం కాబోతోంది! ఆపాలి!

'ఉండండి. మీతో ఒక విషయం మాట్లాడాలి' అన్నాడు సుదర్శనం.

హేమ ఆగింది. బొటనవేలు నేలకు రాస్తూ నిలుచుంది. ఇట్లాంటి శుభగడియ సమీపిస్తుందని సుదర్శనం ఊహించలేదు. ఊహించివుంటే ఏం మాటాడటానికైనా తోచేది. అయినా తప్పదు. తన హృదయం ఆమెకు వెల్లడించాలి. ధైర్యం తెచ్చుకొని! 'హేమా, నిన్ను నే ప్రేమించాను' అన్నాడు. ఇంతదాకా నేలకు వాలివున్న హేమ తలపైకి లేచింది. సన్నగా నవ్వి, 'అందరి ఆడపిల్లల్లాగే నాకు పెళ్ళి ముఖ్యం' అంది.

'నీకా భయమక్కర్లేదు. పెళ్ళి చేసుకుంటాను' అన్నాడు సుదర్శనం ఉద్వేగంగా.

హేమకు ఆశ్చర్యం కలిగింది. 'సరే! నాన్నగారితో మాటాడండి. అదైనా అమీతుమీ ఈరోజు తేలిపోవాలి. నిన్న ఒక సంబంధం వచ్చిన విషయం మీకు తెలుసనుకుంటాను. కట్న కానుకలు అక్కర్లేదంటున్నారు. నాన్న అదే ఖాయం చేద్దామనుకుంటున్నారు' అంది.

'నిజం చెప్పు హేమా! ఆ సంబంధం నీకిష్టమేనా?' అన్నాడు సుదర్శనం.

'కట్నమిచ్చే తాహతు ఉంటే ఇష్టాఇష్టాలు. ఆ తాహతు లేకపోయినాక ఎక్కడికక్కడ సరిపెట్టుకోవడమే మంచిదేమో!' అంది.

'ఇష్టంలేని పెళ్ళికి అంగీకరిస్తావా హేమా? అలా జరగడానికి వీల్లేదు. నేను చేసుకుంటాను. నేనంటే ఇష్టమేనా?' అన్నాడు సుదర్శనం.

ఇష్టమో అయిష్టమో హేమ చెప్పలేదు.

'రండి! నాన్నగారితో కలిసి మాటాడి పెళ్ళి ఏర్పాటు చేద్దాం' అంది హేమ.

యువకిశోరం కొంచెం సందిగ్ధంలో పడ్డాడు. నీళ్ళు నమిలాడు. 'మా నాన్నతో మాట్లాడి ఆయన్ను ఈ పెళ్ళికి వొప్పిస్తాను. నాకా విశ్వాసం వుంది. మీరు కొంచెం టైమ్ ఇవ్వాలి' అన్నాడు.

అమ్మాయి తల అడ్డంగా ఊపింది 'లాభంలేదు. ఈ రోజు పోస్టుకి అవతలి వాళ్ళకు మీ నిర్ణయం తెలియచెయ్యాలి. మీరు స్వయంగా ఒక నిర్ణయానికి రాగలిగితే, సాయంత్రంలోపల నాన్నగారితో మాట్లాడండి' అంటూ హేమ వెళ్ళిపోయింది.

సుదర్శనం హతాశుడయ్యాడు. కాసేపు గదిలో అటూ ఇటూ పచార్లు చేశాడు. కాసేపు జుట్టు పీక్కున్నాడు. నాన్న ప్రమేయం లేకుండా పెళ్ళి చేసుకుందామనుకున్నాడు. ఒకడుగు ముందుకు వేశాడు. హిరణ్యాక్షుడిలా సుదర్శనం నాన్న కళ్ళముందు మెదిలాడు. దాంతో కాళ్ళకు బ్రేకులు పడ్డాయి. కళ్ళకు నీళ్ళు వచ్చాయి. ఏం చెయ్యడానికి పాలుపోక 'నేను భగ్న ప్రేమికుడిని' అనుకున్నాడు. భగ్నప్రేమకు చిహ్నంగా ఆ రాత్రి నిద్రమేలుకొని రెండాటలు చూచి తెల్లారి ఆ గది వదిలి మరొక గది వెతుక్కుంటూ బయలుదేరాడు.

**- (1971, నవంబరు, ఆంధ్రపత్రిక)**